
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 12 సెప్టెంబరు 2025



14న జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో ఈ నెల 14న అండర్-14, 16, 18, 20 విభాగాల బాలబాలికలకు జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.మధుసూదనరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు.. ఎస్ఎస్‌సీ జిరాక్స్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో హాజరు కావాలని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన వారు ఈ నెల 27 నుంచి ఏలూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సిక్కోలు టు ఒడిశా

పేదల బియ్యం అక్రమంగా తరలింపు

- కార్డుదారుల నుంచి కిలో రూ.15కు కొనుగోలు
- వాటిని మిల్లర్లకు రూ.20కు విక్రయం
- ఒడిశాలో రెట్టింపు ధరకు అమ్మకాలు



- జూలై 12న పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద శ్రీకాకుళం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలో 34,800 కిలోల పీడీఎస్ బియ్యం (700 బస్తాలు) పట్టుబడ్డాయి. కొత్తూరు మండలం కడుమలో రైస్‌మిల్లు నుంచి ఈ బియ్యం ఒడిశా రాష్ట్రం నవరంగపూర్‌కు అక్రమ రవాణా చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. వీటి విలువ రూ. 15,83,400 ఉంటుందని నిర్ధారించారు. పట్టుబడిన బియ్యాన్ని లారీతో సహా స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. మిల్లు యాజమానిపై కేసు నమోదు చేయించారు.

- ఆగస్టు 4న సోంపేట మండలం పలాసపురంలో ఓ ఇంట్లో 950 కిలోల పీడీఎస్ బియ్యం విజిలెన్స్ అధికారులకు పట్టుబడ్డాయి. ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని బాధ్యులపై కేసులు నమోదు చేశారు.

- ఈ నెల 8న పలాస మండలం లక్ష్మీపురం టోల్ ప్లాజా వద్ద 11 టన్నుల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. టెక్కలి నుంచి ఒడిశా రాష్ట్రం బరంపురానికి వ్యాన్‌లో ఈ బియ్యం తరలిస్తుండగా.. ముందస్తు సమాచారం మేరకు కాశీబుగ్గ పోలీసులు పట్టుకున్నారు. టెక్కలి, కోటబొమ్మాళి ప్రాంతంలో కిలో రూ.18కు కొనుగోలు చేసి ఒడిశాలో రూ.40కు అమ్ముతున్నట్టు తెలుస్తోంది.



ఇచ్ఛాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో పేదల బియ్యం పక్కదారిపట్టి అక్రమంగా తరలిపోతున్నాయి. జిల్లాలోని సరిహద్దు మండలాల నుంచి పెద్ద ఎత్తున రేషన్ బియ్యం ఒడిశాకు రవాణా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. చిరువ్యాపారులకు కమీషన్లు ఇచ్చి బియ్యం కొనుగోలు చేయడం, వాటిని గుంపగుత్తగా ఒడిశాకు తరలించడం పరిపాటిగా మారింది. ప్రధానంగా సరిహద్దు మండలాల్లోని కొందరు మిల్లర్లు ఈ దందాకు పాల్పడుతున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి దందా కొనసాగుతోంది. సాధారణంగా బియ్యం బస్తా బరువు 50.900 కిలోలు ఉండాలి. కానీ అక్కడే 2కిలోల తరుగు వస్తోంది. కార్డుదారుల నుంచి కిలో రూ.15కు కమీషన్ వ్యాపారులు కొనుగోలుచేస్తే.. వారి వద్ద నుంచి వ్యాపారులు రూ.20కు కొనుగోలు చేస్తుంటారు. అదే బియ్యాన్ని కిలో రూ.40 వరకూ ఒడిశాకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

భారీగా గోల్‌మాల్..

జిల్లాలో మొత్తం రేషన్‌కార్డులు 6,51,717 ఉన్నాయి. 17.95 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా సరఫరా చేస్తున్న బియ్యం 8వేల టన్నుల వరకూ ఉంటుంది. ఐదేళ్లలో అక్రమంగా తరలిస్తున్న పట్టుకున్న బియ్యం 153 టన్నులు. గడిచిన ఆరు నెలల్లో 15టన్నుల బియ్యం పట్టుబడ్డాయి. సాధారణంగా రేషన్ బియ్యాన్ని రైతు కుటుంబాలతో పాటు ఎగువ మధ్యతరగతి వారు ఎక్కువగా విక్రయిస్తుంటారు. గతంలో నేరుగా లబ్ధిదారుల నుంచి డీలర్లే కొనుగోలు చేసేవారు. ఇప్పుడు చిరు వ్యాపారులు సైతం ఇదో వృత్తిగా పెట్టుకున్నారు. గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ కిలో బియ్యాన్ని రూ.15ల వరకూ కొనుగోలు చేస్తున్నారు. వాటినే మిల్లర్లకు అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారు. కిలో దగ్గర (మిగతా 6వ పేజీలో..)

ఆమెది హత్యే

- వీడిన అనుమానాస్పద మృతి మిస్టరీ
- యువకుడి అరెస్టు

ఆమదాలవలస, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస పట్టణం చంద్రయ్యపేటలో గత నెల 30న ఓ వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు ఆమె హత్యకు గురైనట్టు నిర్ధారించారు. నిందితుడిని అరెస్టు చేశారు. గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద ఈ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 'చంద్రయ్యపేటకు చెందిన సీపాన రమణమ్మ (45) హత్య కేసులో సరుబుజ్జిలి గ్రామ పంచాయతీ నందికొండ కాలనీకి చెందిన అడపాక నవీన్ అనే యువకుడిని అరెస్టు చేశాం. నవీన్ తరచూ అమ్మాయిలను రమణమ్మ ఇంటికి తీసుకొచ్చి జల్సాలు చేసేవాడు. ఈక్రమంలో గతనెల 30న తన కోరిక తీర్చమని నవీన్.. రమణమ్మను అడగ్గా ఆమె అంగీకరించలేదు. దీంతో గతంలో తాను అప్పుగా ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని నవీన్ డిమాండ్ చేశాడు. డబ్బులు ఇప్పుడు లేవని చెప్పడంతో ఆగ్రహంతో రమణమ్మ ముఖంపై బలంగా కొట్టాడు. అంతటితో ఆగకుండా గొంతు నులిపేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తర్వాత ఆమె ఇంట్లో ఉన్న 98గ్రాముల బంగారం, 360 గ్రాముల వెండి ఆభరణాలతోపాటు రూ.20వేల నగదుతో అక్కడి నుంచి నవీన్ ఉడాయించాడు. వాటిని తన ఇంట్లో దాచాడు. కొంత బంగారాన్ని ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో తనఖా పెట్టి.. తీసుకున్న డబ్బుతో మళ్లీ జల్సాలు సాగించాడు. కాగా.. ఇంట్లో తన భార్య విగతజీవిగా పడి ఉందని.. బంగారం, వెండి, నగదు మాయమయ్యాయని రమణమ్మ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద స్థితి మృతిగా కేసు నమోదు చేశాము. రిమ్స్‌లో మృతదేహానికి పోస్టుమార్టం చేసిన వైద్యులు ఇది సహజ మరణం కాదని తేల్చారు. ఎవరో బలంగా ఊపిరి ఆడకుండా చేయడంతో మృతి చెందినట్టు ధ్రువీకరించారు. దీనిపై (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

కఠ్మాండూలో క్షేమంగా..

- హోటల్‌లో సురక్షితంగా ఉన్న కాశీబుగ్గ వాసులు
- వారితో ఫోన్‌లో మాట్లాడిన జిల్లా రెవెన్యూ అధికారులు

పలాస, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నేపాల్‌లోని కఠ్మాండులో కాశీబుగ్గ వాసులు క్షేమంగా ఉన్నట్టు సమాచారం అందింది. కాశీబుగ్గకు చెందిన తాళాసు నర్సింహమూర్తి, రమాదేవి దంపతులు.. ఇటీవల మానససరోవర్ యాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నేపాల్ రాజధాని కఠ్మాండూలో చిక్కుకున్నారు. వారితో జిల్లా రెవెన్యూ అధికారులు, 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో మాట్లాడగా.. అక్కడ కైలాస్‌కుట్టి లాడ్జిలో సురక్షితంగా ఉన్నట్టు సమాచారం అందింది.

నర్సింహమూర్తి కాశీబుగ్గలోని ఏ-1 క్యాజూ షాపు నిర్వహిస్తున్నారు. దొడ్ల హేమంత్‌కుమార్(విజయవాడ)కు చెందిన ట్రావెల్స్‌లో విజయవాడ, హైదరాబాద్, కాశీబుగ్గకు చెందిన మొత్తం 64మంది మానససరోవర్ యాత్రకు పది రోజుల కిందట వెళ్లారు. యాత్ర ముగించుకొని తిరుగు ప్రయాణం అవుతున్న సమయంలో నేపాల్‌లో అల్లర్ల కారణంగా దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తెలుగువారు, పర్యాటకులను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక విమాన సర్వీసులు ఏర్పాటు చేసింది. అయితే ట్రావెల్స్ నిర్వాహకులు, నేపాల్ పర్యాటకశాఖ, చైనా ట్రావెల్స్ ఏజెన్సీ సంయుక్తంగా పర్యాటకులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్పించింది.

- కఠ్మాండూలో ఉన్న కాశీబుగ్గ వాసి నర్సింహమూర్తితో గురువారం 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో మాట్లాడగా.. 'నేపాల్‌లో ప్రత్యేక భద్రత మధ్య లాడ్జిలో మాకు బస కల్పించారు. మొత్తం 64 మంది పర్యాటకులం ఉన్నాం. మేమంతా క్షేమంగానే ఉన్నాం. ఆహారం, తాగునీరు సకాలంలో అందిస్తున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేవు. శుక్రవారం మమ్మల్ని స్వస్థలాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. మాకు శ్రీకాకుళం జిల్లా రెవిన్యూ అధికారుల నుంచి కూడా ఫోన్‌కాల్ వచ్చింది. యోగక్షేమాలు అడిగి (మిగతా 6వ పేజీలో..)



మానససరోవర్ వద్ద నర్సింహమూర్తి దంపతులు, కాశీబుగ్గ వాసులు

విశాఖ చేరిన 'మానస సరోవర' యాత్రికులు

- సాదరంగా స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు



విశాఖ విమానాశ్రయంలో సంతబొమ్మాళి వాసులు

శ్రీకాకుళం/ సంతబొమ్మాళి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మానససరోవర్ యాత్రకు వెళ్లిన జిల్లావాసులు క్షేమంగా గురువారం విశాఖ చేరుకున్నారు. నేపాల్ మీదుగా మానససరోవర యాత్రకు వెళ్లి.. అక్కడ ఊహించని విధంగా కఠ్మాండూలో రాష్ట్రానికి చెందిన 186 మంది చిక్కుకున్న విషయం తెలిసిందే. వాళ్లందరినీ క్షేమంగా రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ శ్రద్ధ చూపారు. జిల్లాకు సంబంధించి శ్రీకాకుళం నగరంతోపాటు, శ్రీకాకుళం మండలం రాగోలు, సంతబొమ్మాళి మండలానికి చెందినవారు.. 17మంది మానససరోవర యాత్రకు వెళ్లారు. వారిలో శ్రీకాకుళం నగరానికి చెందిన వానపల్లి శంకరరావు, కపిలేశ్వరి, బరాటం గుర్నాథం, కామేశ్వరి, రాగోలు ప్రాంతానికి చెందిన బొంతల సత్యవతి, శంకర్, సంతబొమ్మాళి మండలానికి చెందిన సాహుకారు బాలరాజు, ఝాన్సీరాణి, నెమలపురి వెంకటరావు, సంతోష్ లక్ష్మి ప్రత్యేక విమానంలో గురువారం విశాఖపట్టణం చేరుకున్నారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్ ఈశ్వరరావు విశాఖ ఎయిర్‌పోర్టు వద్ద జిల్లా యాత్రికులకు సాదర స్వాగతం పలికారు. యాత్రికులతో మాట్లాడి.. వారి యోగ క్షేమాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం, కేంద్ర, రాష్ట్రమంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, నారా లోకేశ్ (మిగతా 6వ పేజీలో..)

బంగారం ధగధగ వెండి

- ఈ ఏడాదిలోనే 10 గ్రాముల స్వర్ణంపై రూ.33 వేలు పెరిగిన వైనం
- అదేబాటలో సిల్వర్ ధరలు
- పెట్టుబడిపై మదుపరుల ఆసక్తి
- ధర పెరిగినా తగ్గని కొనుగోళ్లు

- నరసన్నపేటకు చెందిన ఓ దంపతులు వచ్చే నెలలో తమ కుమార్తె వివాహానికి సంబంధించి ఆభరణాలు కొనుగోలు చేయడానికి గురువారం బంగారం దుకాణానికి వెళ్లారు. అక్కడ తులం ధర రూ.లక్ష దాటేయడంతో అవాక్కయ్యారు. వారం రోజుల వ్యవధిలో రూ.వేలల్లో ధర పెరిగిపోయిందని, అయినా తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేస్తున్నామని వాపోయారు.
- నరసన్నపేటకు చెందిన ఒక వ్యాపారి గతంలో ఇనుపకొట్టు నిర్వహించేవాడు. కొన్నాళ్ల కిందట దానిని మూసేసి.. బంగారంపై పెట్టుబడి పెట్టడం ప్రారంభించాడు. బంగారం బిస్కెట్లు కొనుగోలు చేసి.. ధర కొంచెం పెరిగినా విక్రయించేవాడు. ఈక్రమంలో నెలకు 200 గ్రాముల బంగారం బిస్కెట్లపై రూ.లక్షన్నర వరకూ ఆదాయం పొందుతున్నాడు. ఆ వ్యాపారి బాటలోనే ఎంతోమంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూడా బంగారం బిస్కెట్ల విక్రయాలు సాగిస్తున్నారు. దీంతో బంగారం ధర పెరిగినా డిమాండ్ మాత్రం తగ్గడం లేదు.



బంగారం, వెండి ఆభరణాలు

నరసన్నపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):

బంగారం ధర ఆకాశాన్ని తాకుతోంది. ఈ ఏడాది ఆరంభం నుంచీ ధర పెరుగుతూనే ఉంది. జనవరి నుంచి ఇప్పటి వరకు 22 క్యారెట్లు బంగారం ధర 10 గ్రాములపై సుమారు రూ.30వేలు పెరిగింది. 24 క్యారెట్లు బంగారం ధర రూ.32 వేలకు పైగా పెరిగింది. గురువారం నాటికి నరసన్నపేట బులియన్ మార్కెట్‌లో బంగారం 22 క్యారెట్లు 10 గ్రాముల ధర రూ.లక్ష మార్కును దాటేసింది. ఇక 24 క్యారెట్లు బంగారం ధర రూ.1.10 లక్షలకు చేరింది. సామాన్యుడు చిన్న బంగారం వస్తువును కూడా కొనుగోలు చేసుకునే పరిస్థితి కనిపించడం లేదు. వెండి కూడా బంగారం బాటలోనే పయనిస్తోంది. కేజీ వెండి ధర సుమారు రూ.40వేలకు పెరిగింది. ఈ ఏడాది ఆరంభంతో కిలో ధర రూ.88,500 ఉండగా, తరువాత ఒక్కసారిగా వెండి ధరలు తగ్గుముఖం పట్టినట్లు పట్టి.. పరుగులు తీసింది. జనవరి నుంచి ఇప్పటి వరకు కిలోకు రూ.40,500 వరకు పెరిగింది. దాదాపు 45 శాతం వెండి ధరలు పెరిగాయి.

- జిల్లాలో 500కు పైగా బంగారం దుకాణాలు ఉన్నాయి. ఒక్క నరసన్నపేట పట్టణంలోనే దాదాపు వంద దుకాణాలు ఉన్నాయి. వీటిలో 12 దుకాణాల్లో హోల్‌సేల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. అనధికారకంగా పదుల సంఖ్యల దుకాణాల్లో బంగారం విక్రయిస్తున్నారు. బంగారం ధర పెరుగుతున్నా, రోజుకు కోట్లాది రూపాయల్లో లావాదేవీలు (మిగతా 6వ పేజీలో..)

10 గ్రాముల బంగారం ధర పెంపు ఇలా.. (రూ.లో)

నెల	24క్యారెట్లు	22 క్యారెట్లు
జనవరి	78,330	71,800
ఫిబ్రవరి	84,490	77,450
మార్చి	86,620	79,400
ఏప్రిల్	97,910	89,750
మే	97,310	89,200
జూన్	97,260	89,150
జూలై	1,00480	92,100
ఆగస్టు	1,0,3310	94,700
ప్రస్తుతం	1,10,510	1,0,1300

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా



ఎస్పీ మహేశ్వరరెడ్డితో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

శ్రీకాకుళం లీగల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు ప్రయత్నించాలని జిల్లా న్యాయాధికారి జూనైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. గురువారం ఆయన చాంబర్‌లో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డితో సమావేశమయ్యారు. 'జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు పని చేయాలి. కక్షిదారులకు త్వరితగతిన న్యాయం చేసేలా చూడాలి. ఈ అదాలత్‌ను ప్రభుత్వ అధికారులు, పోలీసులు, ఇన్సూరెన్సు, బ్యాంకు అధికారులు ఉపయోగించుకోవాల'ని జిల్లా న్యాయాధికారి కోరారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు పాల్గొన్నారు.

సంచాం కొండ లీజ్ రద్దు చేయాలి

- స్థానికులు, సమీప గ్రామస్థుల డిమాండ్
- తహసీల్దార్ పరిశీలన
- గ్రావెల్ తీయరాదని స్పష్టం

రణస్థలం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రణస్థలం మండలం సంచాం పంచాయతీలో కొండపై గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి లీజు రద్దు చేయాలని స్థానికులతోపాటు నాలుగు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంచాం (మిగతా 6వ పేజీలో..)



సంచాం కొండపై గ్రావెల్ తవ్వేందుకు సిద్ధం చేసిన యంత్రం



దసరా వస్తోంది.. సరదా తెస్తోంది

● ఆటో కార్మికులకు రూ.15 వేల సాయం ● అక్టోబరు 2న వారి ఖాతాల్లో జమ

శ్రీకాకుళం/కాశీబుగ్గ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం దసరా కానుక అందించబోతోంది. అర్హత కలిగిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.15వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. గత నెల 15వ తేదీ నుంచి స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారు. దీని వల్ల తమ కుటుంబాలకు ఎదురవుతున్న ఆర్థిక ఇబ్బందులపై కొన్ని రోజుల నుంచి ఆటో కార్మికులు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఉచిత ప్రయాణం అమలు నేపథ్యంలో ఆటో కార్మికులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు ఇటీవల భరోసా ఇచ్చారు. ఈ మేరకు అక్టోబరు 2న విజయదశమి రోజున ఒక్కో ఆటో యజమాని ఖాతాలో రూ.15 వేల చొప్పున వేయనున్నట్టు ప్రకటించారు. జిల్లాలో శ్రీకాకుళం నగరంతో పాటు ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం, పాతపట్నం, ఆమదాలవలస, టెక్కలి, పలాస కాశీబుగ్గ, నరసన్నపేట పట్టణాల్లోనూ ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరందరికీ విజయదశమి నాడు రూ.15 వేలు చొప్పున అందనున్నాయి. ఈ సాయం వల్ల జిల్లాలోని వేలాది మంది ఆటో కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పలాస-కాశీబుగ్గలో యూనియన్ల గౌరవ అధ్యక్షుడు దువ్వాడ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం వేడుకలు జరుపుకున్నారు. మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో కర్రి బాబూరావు, దాసరి గోపయ్య, పల్లెటి గణపతి, అప్పారావు, బాలకృష్ణ, జగన్, రామారావు, సురేష్, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఇలా...

జిల్లాలో సుమారు 18 వేల మంది లబ్ధి పొందనున్నట్టు అధికారులు చెబుతున్నారు. మొత్తంగా వీరికి రూ.27 కోట్ల మేర లబ్ధి కలుగనుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లకు రూ.10 వేల సాయాన్ని అందించారు. అది కూడా అనేక ఆంక్షలతో లబ్ధిదారుల సంఖ్యను తగ్గించారు. ఆటో కార్మికుల అకౌంట్లలో రూ.10 వేలు జమ చేసిన కొన్ని రోజులకే అప్పటి ప్రభుత్వం ఆర్టీఓలను రంగంలోకి దించింది. చలానాలు, రవాణా శాఖ నిబంధనల పేరుతో రకరకాలుగా అపరాధ రుసుములు విధించింది. ఈ చేతితో ఇచ్చి.. ఆ చేతితో లాగేసుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న పథకానికి సంబంధించి మార్గదర్శకాలను జారీ చేయనుంది.

ఎవరికి వర్తిస్తుందంటే..

సొంత వాహనం కలిగి.. దాన్ని నడిపే డ్రైవర్లకు ఈ పథకం వర్తిస్తుంది. జిల్లాలో 2023-24 నాటికి ఈ పథకం కింద 14,220 మంది అర్హులు ఉన్నారు. ఇందులో ఆటో డ్రైవర్లు 13 వేల మంది. ట్యాక్సీ మ్యాక్సీ క్యాబ్‌ల డ్రైవర్లు సుమారు 1500 మంది ఉన్నారు. ఇటీవల వీరి సంఖ్య పెరిగి ఉంటుందని రవాణా శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో ఈసారి 18 వేల మందికి పైబడి సాయం అందుతుందని భావిస్తున్నారు. సీఎం ప్రకటన నేపథ్యంలో రవాణా శాఖ జిల్లా డిప్యూటీ కమిషనర్ విజయసారథి ఆర్టీఓలు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ప్రస్తుతం ఎన్ని ఆటోలు, ట్యాక్సీలు, మ్యాక్సీక్యాబ్‌లు ఉన్నాయి? వాటి యజమానుల్లో ఎంత మంది డ్రైవింగ్ చేస్తూ ఉపాధి పొందుతున్నారు? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో ప్రభుత్వం ఇచ్చే మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల సంఖ్యపై స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



నేను పదేళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నా. ఇటీవల ఆటోలకు కాస్త గిరాకీ తగ్గింది. ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తే.. కాస్తంత ఆదుకుంటే బాగుండునని అందరం భావించాం. ఇంతలోనే ముఖ్యమంత్రి శుభవార్త చెప్పారు.

-ధవళ సురేష్, సరుబుజ్జిలి

ఆటో తిప్పడం మానేద్దామనుకున్నా..



ఇకపై ఆటో తిప్పడ మానేద్దామనుకున్న సమయానికి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ప్రస్తుతం ఆర్టీసీ ఉచిత ప్రయాణం వల్ల ఆటోలకు ప్రయాణికులు తగ్గారు. డీజిల్ ఖర్చులు కూడా రావట్లేదు. ఈ సమయంలో ఏడాదికి రూ. 15వేలు ప్రకటించడం ఆనందంగా ఉంది. మావంటి పేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుంది.

-బి.మోహనబాబు, కొల్లివలస, టెక్కలి మండలం

చాలా సంతోషంగా ఉంది..



గతంలో వైసీపీ ప్రభుత్వం రూ.పదివేలు ఇచ్చేది. కూటమి ప్రభుత్వం రూ. 15వేలు ప్రకటించింది. ఇప్పుడు మాకు ఆనందంగా ఉంది. ప్రయాణికుల సంఖ్య తగ్గడం వల్ల ఆటోడ్రైవర్లం ఇబ్బందులు పడుతున్నాం. ఇటువంటి సమయంలో ప్రభుత్వం సాయం ప్రకటించడం ఎంతో ఆనందంగా, ధైర్యంగా ఉంది.

-కె.రాజేష్, బందపల్లి, మెళియాపుట్టి

మంచి నిర్ణయం..



ఇది చాలా మంచి నిర్ణయం. ఆటో కార్మికులకు దసరా కానుకగా రూ.15 వేలు అందిస్తామని చెప్పడం శుభ పరిణామం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణంతో ఆటోలకు గిరాకీ తగ్గింది. మా గోడును పట్టించుకోవాలని కోరాం. సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. మా కోసం ప్రత్యేక పథకం పెట్టడం చాలా ఆనందంగా ఉంది.

-దాసరి గోపయ్య, కాశీబుగ్గ

కృతజ్ఞతలు..



సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు. ఆటోలకు గిరాకీ తగ్గింది. ఉచిత ప్రయాణంతో మహిళలు ఆటోల్లో రావడం మానేశారు. ఇటువంటి సమయంలో పెద్ద మనసుతో రూ.15 వేల లెక్కన సాయం ప్రకటించారు. ఇది హర్షించదగ్గ పరిణామం.

-బాలకృష్ణ, కాశీబుగ్గ

చిన్నారులతో మట్టి పని



మట్టిని సంచుల్లోకి ఎత్తుతున్న చిన్నారులు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు మట్టి పని చేయించారు. ఇటీవల మెయిన్‌రోడ్డు నుంచి పంచాయతీ కార్యాలయం వరకు సీసీ రోడ్డు నిర్మించి.. దానిపై మట్టిని వేశారు. రోడ్డుపై వేసిన మట్టి మిగిలిపోవడంతో దానిని మండుటెండలో విద్యార్థులతో ఉపాధ్యాయులు మోయించి... పాఠశాల ఆవరణలో వేయించారు. నిండా పదేళ్లు లేని పిల్లలతో ఇలాంటి పనులు చేయించడం ఏమిటని ఉపాధ్యాయుల తీరును పలువురు విమర్శించారు. తమ పిల్లలైతే ఇలాగే చేయిస్తారా అని మండిపడ్డారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణను వివరణ కోరగా.. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల తరగతి గదుల ముందు చిన్న చిన్న గుంతలు ఏర్పడి రాళ్లు తేలాయని తెలిపారు. ఇవి పిల్లల కాళ్లకు గుచ్చుకుంటున్నాయని చెప్పారు. వారి బాధ చూడలేక రోడ్డుపై ఉన్న మట్టిని ఉపాధ్యాయులందరం కలసి తీసుకువచ్చి వేశామని అన్నారు. దీనికి పిల్లలు సాయం చేశారని చెప్పుకొచ్చారు.

సిక్కోలు టు ఒడిశా

(ఐదో పేజీ తరువాయి)

రూ.5 నుంచి రూ.10 వరకూ లబ్ధి పొందుతున్నారు.

● **లాభసాటి వ్యాపారం..**

సాధారణంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగిస్తుంది. వారు ఏడాది పొడవునా మిల్లింగ్ చేసి పౌరసరఫరాల శాఖకు అప్పగించాలి. ఇందుకుగాను క్వింటా మిల్లింగ్ చేసేందుకు ప్రభుత్వం రూ.60 చెల్లిస్తుంది. అయితే ఇక్కడే కొందరు మిల్లర్లు దగా చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని నేరుగా లెవీగా చూపుతున్నారు. చిరు వ్యాపారుల ద్వారా కొనుగోలు చేయించిన బియ్యాన్నే మిల్లింగ్ చేసిన బియ్యంగా చూపుతున్నారు. రూ.25 నుంచి రూ.30 వరకూ రేషన్ బియ్యాన్ని చూపి లెవీకి పంపుతున్నారు. బస్తా దగ్గర రూ.30 వరకూ అడ్డగోలుగా దోచుకుంటున్నారు.

● ఇక రేషన్ బియ్యాన్ని రీ సైక్లింగ్ చేసి సన్నబియ్యంగా కొందరు మిల్లర్లు చూపుతున్నారు. తక్కువ ధరకు కొనుగోలు చేసే రేషన్ బియ్యాన్ని సాంబమసూరి వంటి బ్రాండెడ్ బియ్యంలో కలిపి విక్రయిస్తున్నారు. సన్నంగా మరపట్టడంతో వినియోగదారులు సైతం గుర్తించలేక మోసపోతున్నారు. అటు తూకం దగ్గర సైతం ఇదే పరిస్థితి. 25 కిలోలు ఉండే ప్యాకెట్‌లో ఉండేది 23 కిలోలే. రెండు కిలోలు తరుగును చూపిస్తుంటారు. ఇటు బియ్యం నకిలీతో పాటు తూకంలో సైతం వినియోగదారుడు నష్టపోవాల్సి వస్తోంది. ఇంత జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు కానీ.. తూనికలు కొలతలు శాఖ అధికారులు కానీ పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా బియ్యం అక్రమ రవాణా నియంత్రణపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది.

ముమ్మరంగా తనిఖీలు..

జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ప్రత్యేకంగా దృష్టిపెట్టాం. ఇప్పటికే విజిలెన్స్ అధికారులు పెద్ద ఎత్తున తనిఖీలు చేపడుతున్నారు. ఇటీవల కాశీబుగ్గలో భారీగా రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. బాధ్యులపై కేసులు నమోదయ్యాయి. సరిహద్దు ప్రాంతాలపై మరింత నిఘా పెట్టాం.

-సూర్యప్రకాష్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, శ్రీకాకుళం

భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు

● ఎస్పీ మహేశ్వరరెడ్డి



ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, జాయింట్ కలెక్టర్

కోటబొమ్మాళి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు మూడురోజుల పాటు జరగనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలకు వచ్చే భక్తులకు, యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేయాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సత్యనారాయణలకు సూచించారు. వీరు గురువారం కోటబొమ్మాళి మండల కేంద్రంలో జరుగుతున్న కొత్తమ్మతల్లి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఎంతమంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారు? ఏ రోజు ఎక్కువ మంది దర్శించుకుంటారు? తదితర విషయాలను గ్రామపెద్దలు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్‌లను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, బారికేడ్లు, క్యూలైన్ల ఏర్పాట్లు సక్రమంగా ఉండాలన్నారు. వాహనాలు పార్కింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా పెట్టాలని సూచించారు. శోభాయాత్ర, గ్రామీణ క్రీడలు, ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రీడా మైదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే జిల్లా పరిషత్ పాఠశాల మైదానాలను పరిశీలించారు. క్యూలైన్లు, వీఐపీ దర్శనాలు తదితర వివరాలను ఆలయ కార్యనిర్వహణాధికారి వి. రాధాకృష్ణను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ, జాయింట్ కలెక్టర్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. డ్వామా పీడీ సుధాకర్‌బాబు హెలికాప్టర్ టూరిజం కోసం స్థానిక వంశధార విద్యా సంస్థల పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో ఎస్.కృష్ణమూర్తి, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కోరాడ చిన్న గోవింద్, గ్రామ పెద్దలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాఖ చేరిన 'మానస సరోవర' యాత్రికులు

(ఐదో పేజీ తరువాయి)

చొరవతో తాము క్షేమంగా చేరుకున్నామని వారు తెలిపారు. 'ఈ నెల 3న ట్రావెల్ ఏజెన్సీలో మొత్తం 81 మంది నేపాల్ పర్యటనకు వెళ్లాం. అక్కడ కొన్ని దేవాలయాలు సందర్శించాం. లాడ్జిలో బస చేశాం. నేపాల్‌లో అల్లర్ల నేపథ్యంలో లాడ్జిలోనే ఉండిపోయాం. బయటకు వెళ్లాలంటే భయం వేసేది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, నారా లోకేశ్ మాతో మాట్లాడి ప్రత్యేక విమానాల్లో స్వగ్రామానికి చేర్చుతామని చెప్పడంతో కొండంత ధైర్యం వచ్చింది. కఠ్మాండూ నుంచి ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీ చేరుకున్నాం. అక్కడ నుంచి కొందరిని విశాఖకు, మరికొందరిని తిరుపతి విమానాశ్రయాలకు ఉచితంగా చేర్చారు. విశాఖ విమానాశ్రయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు మాకు స్వాగతం పలికారు. ప్రత్యేక బస్సుల్లో స్వగ్రామాలకు చేర్చారు. ప్రభుత్వానికి, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు రుణపడి ఉంటామ'ని సంతబొమ్మాళి మండలానికి చెందిన సాహుకారి బాలరాజు తెలిపారు.

● **మంత్రి లోకేశ్ చూపిన శ్రద్ధను మరువలేం**

మాది శ్రీకాకుళం నగరంలో టీపీఎం స్కూల్ దరి. ఉత్సాహంగా యాత్రకు వెళ్లి చిక్కుకున్నాం. మూడు రోజులు హోటల్‌లోనే ఉండిపోయాం. మంత్రి నారా లోకేశ్ అత్యంత శ్రద్ధ చూపి.. మా అందరితో రెండు రోజుల నుంచి మాట్లాడి మాకు ధైర్యం ఇచ్చారు. అక్కడ ఎంబసీ అధికారులతో మాట్లాడించి.. మేము కేవలం ఆధార్‌తోనే విశాఖపట్నం వరకు విమానంలో వచ్చేలా ఏర్పాట్లు చేశారు. వచ్చేవరకు ఎంతగానో భయపడ్డాం. క్షేమంగా చేరుకున్నాం. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. అంతకుమించి మంత్రి నారా లోకేశ్ వల్లనే సాధ్యమైంది. లోకేశ్‌ను ఏనాటికీ మరువలేము. ఇక్కడకు రాగానే మా ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు.

-వానపల్లి శంకరరావు, కపిలేశ్వరి దంపతులు, శ్రీకాకుళం



విశాఖ ఎయిర్‌పోర్టులో యాత్రికులకు స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు

● **ఆపదలో అండగా నిలిచారు..**

మానస సరోవర్ యాత్రికులకు ఆపదలో మంత్రి లోకేశ్ అండగా నిలిచారు. నేపాల్‌లో జరుగుతున్న మారణహోమంలో తెలుగువారు ఉన్నారని తెలియగానే ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా స్పందించారు. కేంద్రం అండతో.. సమన్వయంతో ఈ ఆపదలో ఉన్న ఒక్కొక్కరినీ సురక్షితంగా రక్షించేందుకు మంత్రి లోకేశ్ పక్కా వ్యూహంతో ముందుకు కదిలారు.

-గొండు శంకర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే

బంగారం వెండి ధగధగ

(ఐదో పేజీ తరువాయి)

సాగుతున్నాయి. ఇందులో జీరో వ్యాపారం 70శాతం మేరకు సాగుతోంది. భవిష్యత్‌లో ధర మరింత పెరుగుతుందనే ఉద్దేశంతో కొంతమంది ఇప్పటి నుంచే కొనుగోలు చేస్తున్నారు. బ్యాంకులు కూడా బంగారంపై ఎక్కువ మొత్తాల్లో రుణాలు ఇవ్వడంతో ఇంకొంతమంది పాత ఆభరణాలు తాకట్టు పెడుతున్నారు. కొత్త ఆభరణాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. వివాహాలు, శుభకార్యాలతోపాటు దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో కొనుగోళ్లు మరింత పెరుగుతాయని వ్యాపారులు చెబుతున్నారు.

మదుపరుల ఆసక్తి..

ధరలు పెరుగుతుండడంతో మదుపరులు బంగారంపై పెట్టుబడి పెడుతున్నారు. మిగతా వ్యాపారాల కన్నా బంగారం రోజుకి 10 గ్రాములకు రూ.500 నుంచి రూ.1,250 వరకు పెరుగుతోంది. దీంతో 100 గ్రాముల బంగారం బిస్కెట్ మీద పెట్టుబడి పెడితే.. రోజువారీ రూ.5వేల వరకు ఆదాయం వస్తోంది. కొందరు వ్యాపారులు, మదుపరులు బంగారం వ్యాపారాన్ని ఎంచుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ట్రంప్ నిర్ణయాలతో వ్యాపార రంగాలపై అనిశ్చితి నేపథ్యంలో మదుపరులు బంగారం కొనుగోలుపై ఆసక్తి చూపడం ధర పెరుగుదలకు ఒక కారణం. అంతర్జాతీయ మార్కెట్ ఔన్స్ బంగారం ధర 500 డాలర్లు వరకు పెరగడం కూడా మరో కారణమని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.

కఠ్మాండూలో క్షేమంగా..

(ఐదో పేజీ తరువాయి)

తెలుసుకున్నారు' అని చెప్పారు. అలాగే నర్సింహమూర్తితో పలాస తహసీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి ఫోన్‌లో మాట్లాడారు. ఎటువంటి సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. స్వదేశం వచ్చేందుకు.. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం విమానసౌకర్యం కూడా ఏర్పాటు చేసిందని తెలిపారు.

● ఇదిలా ఉండగా సదరన్‌ట్రావెల్స్ ఆధ్వర్యంలో కూడా కాశీబుగ్గకు చెందిన జీజేఎస్.రెడ్డి, గిన్ని లలితా దంపతుల బృందం మానససరోవర్ యాత్రకు వెళ్లింది. వీరితోపాటు విశాఖ, విజయవాడ ప్రాంతాలకు చెందిన 22మంది పర్యాటకులు వెళ్లారు. వీరంతా సురక్షితంగా గురువారం ఢిల్లీకి చేరుకున్నారు. అక్కడ నుంచి వివిధ మార్గాల ద్వారా స్వస్థలాలకు రానున్నారు.



ట్రిపుల్ ఐటీ అధికారులతో విద్యార్థులు

ఐబీఎం క్వాంటమ్ ఫెస్ట్‌కు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

ఎచ్చెర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు చెందిన విద్యార్థులను క్విస్టిల్ ఫాల్ ఫెస్ట్ -2025 పేరిట సాంకేతిక ఉత్సవ్ నిర్వహణకు క్వాంటమ్ టెక్నాలజీ గ్లోబల్ సంస్థ ఎంపిక చేసింది. ఇక్కడి క్యాంపస్ విద్యార్థులు కటం నిఖిల్ తేజ, కాసి వాలి దుదేకుల, ప్రవీణ్ కుమార్ చెరుకూరి, జాన్ బాబు చదువులు, గుణశ్రీ కిమ్మిడిలు కలిసి క్వాంటమ్ టెక్నాలజీపై రూపొందించిన ప్రాజెక్ట్‌ను ఐబీఎం సంస్థ ఎంపిక చేసి.. ఫెస్ట్ నిర్వహణకు అవకాశం ఇచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌లను పంపించగా... వీటిలో 55 విశ్వవిద్యాలయాలు మాత్రమే ఎంపికయ్యాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్ విద్యార్థులు ఉన్నారని అకడమిక్ డీన్ డాక్టర్ శివరామకృష్ణ తెలిపారు. ఇక్కడి క్యాంపస్‌లో ఐబీఎం సంస్థ సహకారంతో క్వాంటమ్ టెక్నాలజీపై అక్టోబరు నెలలో ఈ ఫెస్ట్ నిర్వహిస్తామన్నారు. గ్లోబల్ స్థాయిలో విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

ఆమెది హత్యే

(ఐదో పేజీ తరువాయి)

సీఐ పి.సత్యనారాయణ, ఎస్ఐ ఎస్.బాలరాజు దర్యాప్తు ప్రారంభించారు. ఆమెకు ఆ రోజు వచ్చిన కాల్ లిస్టులో నవీన్ పేరు ఉండగా ఆరా తీశారు. చంద్రయ్యపేటవీధిలో నవీన్ తరచూ తిరుగుతుండే వాడని తెలుసుకున్నారు. వారు నవీన్‌ను అదుపులోకి తీసుకునేందుకు యత్నించారు. ఈ విషయం తెలుసుకుని నవీన్ సరుబుజ్జిలి గ్రామ రెవెన్యూ అధికారి వద్ద తన నేరాన్ని అంగీకరించి పోలీసులకు లొంగిపోయాడు. నవీన్‌ను అరెస్టు చేసి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచి.. అనంతరం రిమాండ్‌కు తరలించాం. బంగారం, వెండి, నగదును సీజ్ చేశామ'ని డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను అభినందించారు.

సంచాం కొండ లీజ్ రద్దుచేయాలి

(ఐదో పేజీ తరువాయి)

రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 89-6లో ఏడు ఎకరాల విస్తీర్ణంలో కొండ ఉంది. ఈ కొండ చుట్టూ నాలుగు గ్రామాలు ఉన్నాయి. ఈ కొండపై గ్రావెల్ తవ్వకాలకు సంబంధించి వైసీపీ నేతకు చెందిన ప్రైవేటు సంస్థకు అనుమతులిస్తూ భూగర్భ, గనుల శాఖ ఉత్తర్వులు జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. ఆ సంస్థకు చెందినవారు బుధవారం రాత్రి కొండపై గ్రావెల్ తవ్వకాలకు సిద్ధపడ్డారు. విషయం తెలుసుకున్న స్థానికులు తవ్వకాలను అడ్డుకున్నారు. జేఆర్ పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొండపై గ్రావెల్ తవ్వకాలను పోలీసులు నిలుపుదల చేయించారు. గురువారం తహసీల్దార్ కిరణ్‌కుమార్.. సిబ్బందితో వెళ్లి సంచాం కొండను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ గోడు చెప్పుకున్నారు. 'ఈ కొండ లీజు రద్దు చేయాలి. ఈ కొండపైనే పశువులు, గొర్రెలు, మేకలను మేపుకొని జీవనం సాగిస్తున్నాం. కొండను తొలగిస్తామంటే మేం ఎలా బతికేద'ని పలువురు వాపోయారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ.. 'సంచాం కొండపై గ్రావెల్ తవ్వకాలను నాలుగు గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్న విషయం గతంలో గనులశాఖకు నివేదిక పంపించాం. అక్కడి నుంచి ఆదేశాలు వచ్చేవరకూ ఈ కొండమీద గ్రావెల్ తవ్వకాలు చేపట్టరాద'ని తెలిపారు.



పత్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎస్ఐ చిరంజీవి

పూర్తిస్థాయిలో ఎరువులు పంపించండి

● కంపెనీల ప్రతినిధులను కోరిన కలెక్టర్



యూరియా బస్తాలను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆమదాలవలస, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస రైల్వేస్టేషన్ యార్డుకు పూర్తి స్థాయిలో ఎరువులు పంపించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివిధ యూరియా కంపెనీల ప్రతినిధులను కోరారు. ఈ మేరకు వారితో ఫోన్‌లో మాట్లాడారు. గురు వారం పట్టణంలోని ఎరువులు షాపుల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. యూరియా, వ్యవసాయ విధా నాలపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉందని విలేకరులు అడిగిన ప్రశ్నకు కలెక్టర్ స్పందించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ఇప్పటికే గ్రామాల్లో ఖరీఫ్ సాగుపై అవగాహన కల్పించారని తెలిపారు. ఇంకా ఎక్కడైనా అవసరమైతే సాగుతో పాటు ఎరువుల వాడకంపై కూడా అవగాన కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం స్థానిక రైల్వేస్టేషన్ గూడ్స్ గొడౌన్ వద్ద వ్యాగన్‌లో వచ్చిన ఎరువుల వ్యాగన్‌ను పరిశీలించారు. ఎన్ని మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అరకొరగా ఎరువులు రావడం ఏమిటని సంబంధిత కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ ఫోన్‌లో ప్రశ్నించారు. ఆమదాలవలస రైల్వే స్టేషన్ పరిధిలోకి పూర్తిస్థాయిలో యూరియా పంపించాలన్నారు. తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటరావు, ఏవో మోహన్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ నుంచి మినహాయించండి

● వీపీఏలు, వీహెచ్‌ఏలు కలెక్టరేట్ వద్ద నిరసన



కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న వీఏఏలు, వీహెచ్‌ఏలు

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎరువుల పంపిణీ నుంచి తమను మినహాయించాలని జిల్లాలోని గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ), గ్రామ ఉద్యానవన సహాయకులు(వీహెచ్‌ఏ)లు గురువారం సాయంత్రం కలెక్టరేట్ వద్ద నిరసనకుదిగారు.సమస్యలపై కలెక్టర్ వచ్చి మాట్లాడి పరిష్కరించాలని బైఠాయించారు.అక్కడికు వచ్చిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వీఏఏ, వీహెచ్‌ఏలు తమ సమస్యలను వివరించారు. ఎరువులపంపిణీలో రాజకీయఒత్తిళ్లు, రైతుల నుంచిఅవమానాలు ఎదుర్కొంటున్నామని వివరించారు.ఇంతవరకు ఇచ్చిన ఎరువులను స్టాకు ఉన్నంతవరకు పంపిణీ చేస్తామని, ఇక ముందు వచ్చే ఎరువుల పంపిణీ నుంచి తమను మినహాయించాలని కోరారు. రైతులు ఎరువులకు వచ్చిన వారే మళ్లీమళ్లీ వచ్చి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు.తమలో67 శాతం మహిళలు పనిచేస్తున్నారని, వారిపై కూడా అసభ్యకరంగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఇక ఎంతమాత్రం ఎరువుల పంపిణీ చేయలేమని కలెక్టర్‌కు తెల్చిచెప్పారు. పీఏసీఎస్‌లకు అప్పగించాలని కోరడంతో కలెక్టర్ భరోసా ఇచ్చారు. శుక్రవారం పీఏసీఎస్, సొసైటీలు, డీలర్లతో సమావేశం ఏర్పాటు చేస్తామని, మీ తరఫున కూడా ఐదుగురు ప్రతినిధులు వస్తే సమస్యలకు తక్షణ పరిష్కారం ఆలోచించి, అందుకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేస్తామన్నారు. గంటన్నర పాటు చర్చించిన తర్వాత వీఏఏలు, వీహెచ్‌ఏలు శాంతించారు. రాత్రి పది గంటల వరకు ఈ చర్చలు జరిగాయి.

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌కు 13 మంది ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన 13మంది జిల్లా క్రీడాకారులు సౌత్ జోన్ అథ్లెటిక్స్ జాతీయస్థాయి పోటీలకు తుది జట్టులో స్థానం పదిలపరచుకున్నారు. బాపట్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 25 మంది పతకాలతో తిరిగిరాగా, 13 మంది బాలబాలికలుసౌత్‌జోన్‌కు ఎం పికచేసినట్లు రాష్ట్ర అసోసియేషన్ నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ పోటీలు ఈనెల 26 నుంచి గుంటూరులో జరగనున్నాయి.

పవర్ ప్లాంట్ సర్వేను అడ్డుకున్న గిరిజనులు

సరుబుజ్జిలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):సరుబుజ్జిలి, బూర్జ మండలాల సరిహద్దు ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్‌ప్లాంట్ డీపీఆర్ సర్వేను గిరిజనులు అడ్డుకున్నారు. గురువారంసాయంత్రం సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస సమీపంలో ఏపీ జెన్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిప్పాన హరిరెడ్డి, రాష్ట్ర స్పేస్ అప్లికేషన్ సెంటర్ సైంటిస్ట్ సీహెచ్ తాతబాబు ఆధ్వర్యంలో ట్రోపో గ్రాఫికల్ సర్వేనిర్వహించడానికి వచ్చారు.డీపీఆర్ నిమిత్తం అధికారులు ఫీజబులిటీ సర్వే నిర్వహిస్తున్న సమాచారాన్ని తెలుసుకున్న సరుబుజ్జిలి, బూర్జ మండలాలకు చెందిన కొంతమంది గిరిజనులు అక్కడకు చేరుకొని సర్వేచేస్తున్న అధికారులను అడ్డుకున్నారు. సర్వేకు ఉపయోగించే డ్రోన్ కెమెరాలు, ఎక్విప్‌మెంట్‌ను గిరిజనులు తీసుకోవడంతో సంబంధిత అధికారులు ఆమదాలవలస సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు. సీఐతో పాటు బూర్జ ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక పోలీస్‌సిబ్బందితో అక్కడి చేరుకొని గిరిజనులతో మాట్లాడి వారు తీసుకున్న డ్రోన్ కెమెరా ఎక్విప్‌మెంట్‌ను తిరిగి సర్వే అధికారులకు అప్పగించారు.అనంతరం అధికారులు పోలీసులు గిరిజనులతో మాట్లాడుతూ త్వరలో సరుబుజ్జిలి, బూర్జ తహసీల్దార్లు, పోలీస్ అధికారులతో గిరిజన గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీంతో గిరిజనులు శాంతించడం సర్వే అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు.



సర్వే పరికరాలను అధికారుల నుంచి తీసుకుంటున్న గిరిజనులు

ఓపీఎస్ అమలుచేయాలి

● తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఉపాధ్యాయుల నిరసన

పాత పింఛన్ విధానం అమలుచేయాలని(ఓపీఎస్) డీఎస్సీ-2003 ఉపాధ్యా యులు డిమాండ్‌చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయాల వద్ద వివిధ ఆయా ఉపాధ్యాయ సంఘ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

●గుజరాతీపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని తహసీల్దార్ కార్యాలయంలో వద్ద డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు మెమో-57ను అమలు చేయడం ద్వారా పాతపెన్షన్ విధానాన్ని వర్తింపుజేయాలని డీఎస్సీ-2003 ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.అలాగే జిల్లాలోని ఉపాధ్యాయులు తమ సమస్యలు పరిష్కరించాలని నల్లబ్యాడ్జీలతో పాఠశాలలకు హాజరయ్యారు.

● ఆమదాలవలస, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, పోలీసులు గ్రూప్-1, 2 ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డీఎస్సీ-2003 ఉపాధ్యాయుల ఫోరం డిమాండ్ చేసింది.స్థానిక తాలూకా కేంద్రంలో ఉపాధ్యాయులు, సంఘ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు.

●సరుబుజ్జిలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్య లను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు రామన్న డిమాండ్ చేశారు. రొట్టవలసఉన్నతపాఠశాల ఆవరణలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

● పొందూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నతపాఠశాల ఆవరణలో పెండింగ్‌లో ఉన్న విద్య, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు.



గుజరాతీపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్సీ-2003 ఉపాధ్యాయులు

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి కోల్పోతున్న ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్‌చేశారు. శ్రీకాకుళంలోని కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం వారు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రమణ, ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య, ఆటో యూనియన్ నాయకులు జగన్నాథం, పి.మోహనరావు, చంద్రునాయుడు పాల్గొన్నారు.

డ్రైనేజీలతో కూడిన రోడ్లు నిర్మించాలి: ఎమ్మెల్యే

ఆమదాలవలస, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో వివిధ అభివృద్ధి పనుల్లో మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మునిసిపాలిటీలోని 5, 9, 10, 11 వార్డుల్లో బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ నిధులు రూ.56.76 లక్షలలో సీసీరోడ్లు, డ్రైనేజీలకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ప్రతి ప్రాంతంలో డ్రైనేజీతో కూడిన సీసీ రోడ్లు నిర్మించాలని, అలా కాకుండా సీసీ రహదారి నిర్మాణానికి ప్రతిపాదించడంపై మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ జాన్సన్‌ను ప్రశ్నించారు.కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ తమ్మినేని రవి, మునిసిపల్ మాజీచైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, టీడీపీ నాయకులు మొదలవలస రమేష్, బోర గోవిందరావు, మురళీధర్‌యాదవ్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ స్థలంలో ఆక్రమణల తొలగింపు

పొందూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పొందూరు పీఏసీఎస్ చెందిన స్థలంలో ఆక్రమణలను రెవెన్యూ, పోలీసులు, డీసీసీబీ అధికారులు సమక్షంలో తొలగించారు. పొందూరు పీఏసీఎస్‌కు జోగన్నపేట 408-8 సర్వేనంబరులో 26.5 సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలాన్ని పీఏసీఎస్ పాలకవర్గం 1983లో కొనుగోలు చేసింది. వైసీపీ హయాంలో జోగన్నపేటకు చెందిన వైసీపీ నాయకుడు ఈ స్థలంలో సుమారు ఎనిమిది సెంట్ల స్థలాన్ని ఆక్రమించి కొబ్బరి, అరటి చెట్లు వేశారు. స్థానికులు, పీఏసీఎస్ సిబ్బంది ఫిర్యాదుమేరకు పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని ఎమ్మెల్యే రవికుమార్ ఆదేశించారు. ఇటీవల ఆక్రమణలు తొలగించాలని ప్రయత్నించిన సమయంలో ఆ వైసీపీ నాయకుడు స్థానికులతో కలిపి అడ్డుకున్న విషయం విదితమే. దీంతో డీసీసీబీ అధికారులు జేసీకి ఫిర్యాదుమేరకు ఎమ్మెల్యే రవికుమార్, జేసీఆదేశాలతో గురువారం తహసీల్దార్ వెంకటేష్, డీసీసీబీ సీఈవో సత్యనారాయణ, టీడీపీ మండలాధ్యక్షులు రామ్మోహన్ ఆధ్వర్యంలో పోలీసులసమక్షంలో ఆక్రమణలు తొలగించారు.ఈ మేరకు ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలి

గార రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వేతనదారులు జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలని ఏపీవో సంధ్యారాణి కోరారు. వమరవల్లిలో సామాజిక తనిఖీ బృందం సభ్యులు, వేతనదారులుతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

మెడికల్‌కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, బొల్లినేని మెడిస్కిల్స్ (జెమ్స్, రాగోలు) సంయుక్తంగా నిర్వహిస్తున్న మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కాలవ్యవధి గల మాస్టర్ ఆఫ్ హెల్త్‌కేర్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులో, ఏడాది వ్యవధి గల పీజీ డిప్లమో ఇన్ మెడికల్ రికార్డ్స్ అండ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ కోర్సుల్లో చెరో 40 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 30లోగా వర్సిటీ లేదా బొల్లినేని మెడిస్కిల్స్ కార్యాలయాల్లో ఎక్కడైనా అందజేయవచ్చని తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

కంచిలి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని డీఎల్‌పీవో ఐవీ రమణ తెలిపారు. జాడుపూడిలో ప్రజలకు చెత్తసేకరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రస్వామి, ఈశ్వరరావు, జయరాం పాల్గొన్నారు.

ప్రయోగశాల నిర్మాణానికి నిధుల మంజూరు

ఆమదాలవలస, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బూర్జలోని కేజీబీవీ పాఠశాలలో ప్రయోగశాల నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే కూన రవికుమార్ కార్యాలయం వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. రాష్ట్ర సమగ్ర శిక్షణ ప్రాజెక్టు డైరెక్టర్ ఉత్తర్వులు మేరకు నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నాయి. కేజీబీవీ పాఠశాలలో మూడు ప్రయోగశాల నిర్మాణానికి 69.30 లక్షల రూపాయలు మంజూరయ్యాయని తెలిపాయి.

జనసేన కార్యాలయం ప్రారంభం

కంచిలి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కత్తివరంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ గురువారం ప్రారంభించారు.కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, కూటమి నాయకులు మాదిన రామారావు, జగదీష్ పట్నాయక్, బంగారు కురయ్య, జీకే నాయుడు, అశోక్, బొడ్డు అప్పారావు పాల్గొన్నారు.

● కవిటి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కవిటి మండల టీడీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా ఎస్.చింతామణి బెహరాను నియమించడంతో మాణిక్యపురానికి చెందిన మైనార్టీ విభాగ పెద్దలు రామయ్యపుట్టుగలో పభుత్వ విప్ బి.అశోక్, టీడీపీ మండలాధ్యక్షుడు పి.కృష్ణారావును సన్మానించారు. కార్యక్రమంలో దుర్యోధన, ఢిల్లీసాహు, సంతోష్, తులసి పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్ వితరణ

గార రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): వమరవల్లి బాలి కల గురుకుల పాఠశాలలో లక్ష రూపాయల విలువ గల ఆర్వో ప్లాంటును గైనకాలజిస్టు దానేటు శ్రీధర్ ఏర్పాటు చేయించారు. పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు రూ.1,70,000 వెచ్చించి రేకుల షెడ్డు నిర్మించడంతో శ్రీధర్ అభినందించారు.

తాగునీటి పైపులకు మరమ్మతు చేయాలి

సోంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బారువ పోస్టాఫీసు వీధిలో మంచి నీటి పైపులు పాడవడంతో మరమ్మతులు చేయాలని ఆవీధికి చెందిన ఆర్.కృష్ణవేణి, ఈశ్వరి, లక్ష్మి కోరారు.ఈవోకి గురువారం వినతి పత్రం అందజేశారు.

వాడుకనీరు రోడ్లపై విడిచిపెడితే చర్యలు

సోంపేట రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గృహ అవసరాలకు వినియోగించే వాడుక నీరు రోడ్లపైకి విడిచిపెడితే చర్యలు తీసుకుంటామ ని సిరిమామిడి సచివాలయం సిబ్బంది హెచ్చరించారు. ఎరముక్కాం లండ వారివీధిలో వాడుక నీరు రోడ్డుపై విడిచిపెడుతుండడంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. స్థానిక మహిళలు, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదుమేరకు గురువారం వీధివాసులకు అవగాహన కల్పించారు. పరిసితుల్లో మార్పు రాకపోతే నోటీసులిచ్చి కేసులు పెట్టాల్సి వస్తుందని కార్యదర్శి జగదీష్, బాలకృష్ణ తెలిపారు.

బోధనేతర బాధ్యతల నుంచి తప్పించాలి

కవిటి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): టీచర్లకు బోధనేతర బాధ్యతలనుంచి తప్పించాలని ఏపీటీఎఫ్-1938 రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.గోపి, మండలాధ్యక్షుడు బి.ధర్మారావు,జిల్లా కార్యదర్శి ఎస్.రాజబాబు,కె.రంగారావు,శ్రీరామ్ బిసొయి ఒకప్రకటనలో కోరారు. కరువు భత్యం చెల్లించకపోవడం, పీఆర్సీ ఏర్పాటు చేయకపోవడంతో నష్టపోతున్నామని తెలిపారు.

లక్ష్య సాధనకు కృషిచేయాలి: ఏపీసీ

గార /రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధనకు కృషి చేయాలని సర్వశిక్షా అభియాన్ ఏపీసీ శశిభూషణ్ తెలిపారు. గురువారం వమరవల్లిలోని జిల్లా విద్యాశిక్షణసంస్థలో జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. తొలి రోజు నిర్వహించిన పాటలు, నృత్యం, వాయిద్య సంగీత పోటీలకు జిల్లాలోని 40 పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు.గాత్ర సంగీతం విభాగానికి వంజరాం జడ్పీఉన్నత పాఠశాల విద్యార్థి ఆర్.వెంకటేష్, వాయిద్య సంగీతం విభాగానికి ముత్యాలపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్ వర్షిణి, గ్రూపుసాంగ్ విభాగంలో టెక్కలి మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలకు ప్రథమ బహుమతి, శ్రీకాకుళంలోని న్యూసెంట్రల్ స్కూల్‌కు ద్వితీయ బహుమతిని గెలుచుకోగా ప్రిన్సిపాల్ ఎ.గౌరీశంకర్రావు ప్రశంసాపత్రాలను అందజేశారు.విజేతలు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నోడల్ అధికారి తాడేల వెంకటరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వినోదిని, అసిస్టెంట్ నోడల్ అధికారి చలపాక రమణ, ఆచార్యులు గోవిందరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శశిభూషణ్

విద్యార్హతల ఆధారంగా విధులను అప్పగించండి

జి.సిగడాం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):తమ విద్యార్హతల ఆధారంగా రాష్ట్రాభివృద్ధికి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు అప్పగించేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలని జి.సిగడాం మండల సచివాలయ ఉద్యోగులు కోరారు.ఈ మేరకు గురువారం ఎంపీడీవో జి.రామకృష్ణ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తులసీ ప్రసాద్ సాహూ, డీఏల అధ్యక్షుడు మో హన్ గణేష్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లు 20 శాతానికి పెంచాలి

పాత శ్రీకాకుళం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల జంక్షన్ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఎస్సీ, ఎస్టీ దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెరిగిన ఎస్సీ జనాభాకి అనుగుణంగా రిజర్వేషన్లు 20 శాతానికి పెంచాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, జిల్లా దళిత సంఘాల నాయకులు దళిత సంఘాల జేఏసీ నేతలు పాల్గొన్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

ఎచ్చెర్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):తీరంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని మెరైన్ సీఐ బి.ప్రసాదరావు సూచించారు. కొత్త మత్స్యలేశంలో కళింగపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీరంలో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే సమాచారంఇవ్వాలని కోరారు.కార్యక్రమంలో మెరైన్ ఎస్ఐ జి.హరికృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గంలో సమస్యలు పరిష్కరించండి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గం నాలుగు మండలాల్లో సమస్యలు పరిష్కరించాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, తడక జోగారావు కోరారు. మేరకు గురువారం డీఆర్వో వెంకటేశ్వరరావుకు కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. కవిటి మండలంలోని దూగానపుట్టుగ ప్రాథమికోన్నత పాఠశాలలో 59మంది విద్యార్థులు ఉండగా ఒక్క ఉపాధ్యాయులు మాత్రమే ఉనారని, తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

101 మందికి కిడ్నీ పరీక్షలు

సోంపేట రూరల్,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎర్రముక్కంలో నిర్వహించిన కిడ్నీ వైద్య శిబిరంలో 101 మందికి పరీక్షలు నిర్వహించారు. సేకరించిన రక్తనమూనాలను ల్యాబ్‌కు పంపించి పరీక్ష అనంతరం సీకేడీ స్థాయి నిర్ధారిస్తామని బట్టిగళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి సౌజన్య తెలిపారు.

పట్టుబడిన అంతర్రాష్ట్ర గంజాయి ముఠా

● 10.6 కిలోలతో ఇద్దరి అరెస్టు ● డీఎస్పీ వెంకట అప్పారావు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

పలాస, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గంజాయితో అంతర్రాష్ట్ర ముఠా పట్టుబడిందని కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అర్గుపూర్ గ్రామానికి చెందిన రోహిత్, యశ్వాస్ గ్రామానికి చెందిన నూరుద్దీన్ స్నేహితులు. గంజాయి స్మగ్లింగ్ ద్వారా సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకున్నారు. ఈ క్రమంలో వీరు ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన సుమన్ మాలిక్ వద్ద 10.6 కిలోల గంజాయి కొనుగోలు చేసి బుధవారం రాత్రి పలాస రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. దీనిని కేరళ రాష్ట్రం తవనూర్ గ్రామానికి చెందిన టి.ఆస్కార్‌కి అందించేందుకు వీరు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదే సమయంలో పలాస రైల్వే స్టేషన్ రోడ్డులో కాశీబుగ్గ ఎస్ఐ నర్సింహమూర్తి తన సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తున్నారు. వీరిపై అనుమానం రావడంతో వారి బ్యాగులు తనిఖీ చేయగా.. గంజాయి ఉన్నట్టు గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. గతంలో కూడా వీరిపై గంజాయి రవాణా కేసులు ఉన్నాయన్నారు. ఈ కేసులో మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి ఇద్దర్ని అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈగల్ టీమ్‌లు ఏర్పాటు చేసిన తర్వాత గంజాయిపై పూర్తి నిఘా పెట్టామని డీఎస్పీ అన్నారు. ఒడిశా సరిహద్దు గొప్పిలి, వసుంధర, ఇచ్ఛాపురం వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా ఉంచామన్నారు. సమావేశంలో ఎస్ఐ నర్సింహమూర్తి, సిబ్బంది ఉన్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి


అప్పలనాయుడు(ఫైల్)

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బసవరాజుపేట గ్రామానికి చెంది న వాన అప్పలనాయుడు(38) గురువారం పాముకాటుకు గురై మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. అప్పలనాయుడు గ్రామ సమీప పొలంలో ఎరువువేస్తుండగా కాలుకు పాముచుట్టుకొని కాటువేసింది. దీన్ని గుర్తించిన అప్పలనాయుడు కుటుంబసభ్యులకు చెప్పగా.. వెంటనే హిరమండలంలోని సుబలయి పీహెచ్‌సీకి తీసుకువెళ్లి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా అప్పలనాయుడుకి భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ హైమావతి కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ..


రమణమ్మ(ఫైల్)

నరసన్నపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నడగాం పంచాయతీ శివరాంపురం గ్రామానికి చెందిన తోలాపి రమణమ్మ(50) పాముకాటుకు గురై శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందారు. ఈ నెల 5వ తేదీన రమణమ్మ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో కాలుపై పాము కాటువేసింది. వెంటనే నరసన్నపేట వంద పడకల ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందజేశారు. పరిస్థితి విషమించడంతో ఈనెల 6న శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందారు. రమణమ్మ భర్త సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా కుమార్తెకు వివాహం అయింది.

ఆర్టీసీ బస్సులో కొట్లాట

● సోషల్ మీడియాలో వీడియో వైరల్


కొట్టుకుంటున్న మహిళ, విద్యార్థి

టెక్కలి రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నౌగాం నుంచి టెక్కలి వస్తున్నా ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులో గురువారం ఉదయం కొట్లాట జరిగింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పించింది. దీంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ రోజురోజుకు పెరుగుతుంది. ఈ క్రమంలో సీట్ల కోసం తగదాలు జరుగుతున్నాయి. ఇటీవల విజయనగరం నుంచి విశాఖ వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ఓ మహిళా, ఓ వ్యక్తి తగదాపడడం, ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. అయితే తాజాగా టెక్కలికి చెంది మహిళా, మరో విద్యార్థి సీట్ కోసం తగదాపడి జుత్తులు పట్టు కొని లాగుకోవడం కనిపించింది. తరచూ ఇటువంటి ఘటనలు జరుగు తుండడంతో ప్రభుత్వం ప్రాత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


లారీ ఢీకొనడంతో విరిగిన స్తంభం

టెక్కలి రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రావివలస గ్రామంలో గురువారం లారీ విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టింది. టెక్కలి నుంచి సంతబొమ్మాళి వైపు రావివలస గ్రామం మీదుగా వెళ్తుంది. ఈ క్రమంలో లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో అది నేలకొరిగింది. అయితే ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇదే సమయంలో ట్రాన్స్‌కో అధికారులకు ఆ గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తం అయ్యారు.

సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య


రామకృష్ణ(ఫైల్)

ఎచ్చెర్ల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంబాద్ గ్రామానికి చెందిన సీపాన రామకృష్ణ(27) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇంటర్ వరకు చదువుకున్న రామకృష్ణ శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నారు. తల్లి లక్ష్మి వ్యవసాయ పనులు ముగించుకుని మధ్యాహ్నా భోజన సమయంలో ఇంటికి వచ్చి చూడగా, రామకృష్ణ ఫ్యాన్‌కు వేలాడి ఉండడాన్ని చూసి కన్నీరుమున్నీరు విలపించింది. కాగా రామకృష్ణకు తమ్ముడు ఉన్నాడు. తండ్రి జగన్నాథం పదిహేనేళ్ల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిపోగా, తల్లి లక్ష్మి అన్నీ తానై కుటుంబాన్ని నెట్టుకొచ్చింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించారు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు గల కారణాలు దర్యాప్తులో వెల్లడవుతాయని ఎస్ఐ వి.సందీప్‌కుమార్ చెప్పారు.

ఇంజక్షన్ వికటించి వివాహిత మృతి

● పరారైన పీఎంపీ
● ఆందోళన చేసిన కుటుంబ సభ్యులు
● ఘటనపై జిల్లా అధికారులు ఆరా
● మృతిరాలిది మన్యం జిల్లా ఘనసర

కొత్తూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొత్తూరులోని ఓ ప్రైవేట్ క్లినిక్‌లో వైద్యుడు ఇచ్చిన ఇంజక్షన్ వికటించి ఓ వివాహిత మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం ఘనసర గ్రామానికి చెందిన తేజాలమ్మ(53) తన భర్త తవుడుతో కలిసి గురువారం మధ్యాహ్నం చికిత్స కోసం కొత్తూరు నాలుగు రోడ్ల జంక్షన్‌లో గల శ్రీసాయి ప్రజా వైద్యశాలలో గల పీఎంపీ నాగేశ్వరరావు వద్దకు వచ్చారు. తనకు కాళ్ల పీకులు, నొప్పులు ఉన్నాయని వైద్యుడుకి వివరించింది. సమస్య విన్న నాగేశ్వరరా వు ఆమెకు ఇంజక్షన్ చేస్తుండగానే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. ఇది గమనించి వైద్యుడు ఆమె పరిస్థితి విషమంగా ఉందని, తక్షణమే వేరే ఆసుపత్రికి తీసుకుని వెళ్లాలని ఆమె భర్తకు చెప్పి తప్పించుకోవాలనుకున్నాడు. పీఎంపీ కపటితనాన్ని గుర్తించిన ఆమె భర్త తవుడు తన ఎదుటే ప్రాణం విడిసిందని కేకలు వేస్తూ ఏడ్చాడు. దీంతో మృతదేహాన్ని బెడ్‌పైనే ఉంచేసి పీఎంపీ ఆసుపత్రికి తాళాలు వేసి వెళ్లిపోయాడు. ఈ విషయం మృతిరాలి కుటుంబ సభ్యులకు తెలియడంతో వారంతా ఆసుపత్రి వద్దకి చేరుకుని నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ సీహెచ్ ప్రసాద్, ఎస్ఐ ఎండీ అమీరు ఆలీ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి అదుపులో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో కలెక్టర్, ఎస్పీ స్పందించి తక్షణమే నివేదికలు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో కురిగాం ఆసుపత్రి వైద్యులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి నివేదిక ఉన్నతాధికారులకు అందించినట్టు తెలుస్తుంది. ఆసుపత్రి ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతులు ఉన్నాయా? లేవా? వంటి విషయాలపై ఆరా తీస్తున్నారు. ఆసుపత్రి వద్ద సుమారు నాలుగు గంటల పాటు హైడ్రామా నడిచింది. బాధితులకు న్యాయం చేసేందుకు పీఎంపీతో రాజీ కుదిర్చేందుకు పలువురు ప్రయత్నించినా ఫలించకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించేందుకు పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. తేజాలమ్మకి భర్తతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరంతా ఇతర ప్రాంతాల్లో ఉంటూ జీవనోపాధి పొందుతున్నారు. తవుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు.


తేజాలమ్మ మృతదేహం


ఆసుపత్రి వద్ద గుమిగూడిన ప్రజలు

నేపాల్ బాధితులకు అండగా ప్రభుత్వం


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట

కొత్తూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) నేపాల్ దర్ఘటనలో కాఠ్మండ్‌లో చిక్కుకున్న తెలుగు ప్రజలను ఆదుకోవడంలో చొరవ చూపిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కూటమి ప్రభుత్వం ఘనతను మరోమారు చాటిచూపారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి అన్నారు. గురువారం సాయంత్రం కొత్తూరులో విలేకరులతో మాట్లాడారు. కర్లెమ్మ సర్పంచ్ ఎల్‌భగవాన్‌దాస్ నాయుడు, మడపాన రాజారావు, వాసు తదితరలు పాల్గొన్నారు.

గిరిజనుల ఇళ్ల నిర్మాణానికి లైన్ క్లియర్

మెళియాపుట్టి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): దాదాపు మూడు దశాబ్దాల ఆ గిరిజన గూడ ప్రజలు కల ఎట్టికేలకు తీరనుంది. దీంతో వారి ఆనందానికి హద్దుల్లేవు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని కేరాసింగ్ పంచాయతీ గూడ గ్రామంలో ఇళ్ల కాలనీ మంజూరైనా స్థలం లేకపోవడంతో వారి కల నెలవేరలేదు. కొండ చుట్టూ జిరాయితీ భూమలు ఉండడంతో కొండపైన ఇళ్ల నిర్మాణాలకు ఆటంకంగా ఉండేది. చివరికి వారి బాధలను గుర్తించిన మాజీ ఎంపీపీ బైరిసింగి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రట్టిని గ్రామానికి చెందిన దేవీ ప్రసాద్ జిన్నాను ఒప్పించారు. దీంతో ఆయన ఉచితంగా ఎకర భూమి ఇవ్వడంతో కాలనీ నిర్మాణానికి అడ్డంకిలు తొలగిపోయాయి. దీంతో స్థలం ఇచ్చిన దేవీప్రసాద్ జిన్నాను గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గిరజన మహిళా సంఘ నాయకురాలు బైరసింగి ధరణి, రట్టిని సర్పంచ్ ముఖ్లికో తదితరలు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ బాధ్యత కార్యదర్శులదే

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధి పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని స్థానిక సంస్థల సీనియర్ ఆడిటర్ ప్రసన్నకుమార్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 2024, ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025, మార్చి 31వ తేదీ వరకు పంచాయతీ రికార్డులను ఆడిట్ చేయడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో పి.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వసంతాల పేర్లతో మొక్కలు


వసంతాల పేర్లతో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పలాసరూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం సత్యసాయి విద్యావిహార్ పాఠశాల విద్యార్థులు ప్రేమతరూ కార్యక్రమంలో భాగంగా గురువారం స్కూల్ పరిసరాల్లో 60 వసంతాల పేర్లతో మొక్కలు నాటారు. మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, ఉపాధ్యాయులు అనుదీప్, చంద్రశేఖర్, సంగీత, కల్యాణి, కల్పన, జగదీశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రి సామర్థ్యం పెంపుపై హర్షం


పాలభిషేకం చేస్తున్న టీడీపీ శ్రేణులు

టెక్కలి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ఆసుపత్రి 150 పడకల నుంచి 200 పడకల ఆసుపత్రిగా సామర్థ్యం పెంపునకు కృషి చేసిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడులతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం జిల్లా కేంద్ర ఆసుపత్రి, టెక్కలిలో పాలభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బగాది శేషగిరి, హనుమంతు రామకృష్ణ, పురుషోత్తం, రాము, లవకుమార్ తదితరులు ఉన్నారు.

ప్రతిభా పురస్కారాలు ప్రేరణ కలిగిస్తాయి

నందిగాం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతిభా పురస్కారాలు విద్యార్థుల్లో ప్రేరణ కలిగిస్తాయని టెక్కలి ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్ అన్నారు. గురువారం నందిగాం ఉన్నతపాఠశాల వేదికగా ఏపీటీఎఫ్-257 ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల వేడుక నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌వీ అనీల్‌కుమార్, ఎంఈవోలు జి.నర్సింహులు, ఎ.చిన్నారావు, హెచ్‌ఎంలు కె.హేమలత, సీహెచ్ కృష్ణారావు, రామారావు, ఏపీటీఎఫ్ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మల్లేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతితో అధిక దిగుబడి

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): శాస్త్రవేత్తల సలహాలు, యాజమాన్య పద్ధతులు పాటిస్తే సులభంగా జీడిమామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చని హెచ్ఆర్ఎస్ సైంటిస్టు టి.రాజశేఖర్ తెలిపారు. కారిగూడ గిరిజన గ్రామంలో చైతన్య పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో ఉద్యానవనశాఖ సహకారంతో జీడిమామిడిలో యాజమాన్య పద్ధతులపై గురువారం రైతులకు ఒక రోజు శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌వో అయంతి కుమారి, పీసీవో గోపాల్, హెచ్‌ఈవో తిరుపతిరావు, వీఏఏ శ్యామల, సంజీవరావు, ధర్మారావు, చైతన్యలతోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పలాస, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతు ఉద్యోగుల సంఘ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావుకు వినతిపత్రం సమర్పించారు. ఇంటింటికి తిరిగే సర్వేల నుంచి విముక్తి కలిగించాలని, ఉద్యోగులకు ఇంక్రిమెట్లు మంజూరు చేయాలని, రికార్డు అసిస్టెంట్లు నుంచి జూనియర్ అసిస్టెంట్ కేడరుకు మార్చాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో జెఏసీ నాయకులు మౌనిక, ధర్మారావు, చక్రధరి, మనోహర్, సంపత్ పాల్గొన్నారు.

హిందీ పాఠ్యాంశంపై క్విజ్‌పోటీలు

పోలాకి, సెపెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14వతేదీన హిందీభాషా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోడూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. హిందీ పండితులు శాంతి, రాజేశ్వరరావు, భవానీ ఆధ్వర్యంలో హిందీ పాఠ్యాంశంపై క్విజ్ నిర్వహించారు. విజేతలకు ఈ నెల 14న హిందీదివస్ సందర్భంగా బహుమతులు అందిస్తామని హెచ్‌ఎం శాంతి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


రమేష్(ఫైల్)

హరిపురం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మందస మండలం బుడారిసింగి పంచాయతీ రడాలు గిరిజన గ్రామానికి చెందిన ఎస్.రమేష్(30) విద్యుత్ షాక్‌కు గురై గురువారం మరణించాడు. తన ఇంటిలో ఫ్యాన్ మరమ్మతులు చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించిందని, రమేష్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అంతేకాకుండా ఎలక్ట్రీషియన్‌గా అనుభవం ఉంది. రమేష్‌కు భార్య ద్రౌపతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హరిపురం ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

ఆటో కార్మికులకు ఉపాధి కల్పించాలి

పలాస రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమకు ఉపాధి భద్రత కల్పించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటోకార్మికులు కోరారు. ఈ మేరకు గురువారం ఆర్డీవో కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.గణపతి, ఆటో యూనియన్ నాయకులు ఎం.చంద్రశేఖర్, వి.కృష్ణారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు తాతారావు, రేవంత్‌రెడ్డి, దిలీప్, జి.దుర్యోధన, కె.కృష్ణారావు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

టెక్కలి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉచిత బస్సు పథకం వల్ల ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డ తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సీఐటీయూ నాయకులు హనుమంతు ఈశ్వరరావు, నంబూరు షన్ముఖరావులతో కలిసి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఫ్రీబస్సు సౌకర్యం వల్ల ఆటోడ్రైవర్లకు కిరాయిలు లేక తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఆటోడ్రైవర్లపై మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సంకట స్థితిలో నెట్టిందని తెలిపారు. చంద్రబాబు ప్రకటించిన రూ.15వేలు ఆర్థిక సాయం రూ.30వేలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో క్రిష్ణారావు, రమణ, శ్యామలరావు, రాజేష్, పోలయ్య, అప్పారావు తదితరులు ఉన్నారు.

దారి పొడుగునా గుంతలే..



పాతపట్నం సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తెంబూరు నుంచి అంపురం మీదుగా బడ్డుమర్రి వెళ్లే బీటీ రోడ్డు అడుగడుగునా గోతులు ఏర్పాడ్డాయి. తెంబూరు రైల్వేస్టేషన్ కూడలి మొదలుకొని బడ్డుమర్రి వరకు సుమారు ఐదు కిలోమీటర్ల పొడవు గల ఈ రోడ్డు అధ్వానంగా తయారైంది. తెంబూరు మొదలుకొని ఎస్.జగన్నాథపురం, కొత్తూరు, రాజన్నపేట తదితర సుమారు 14 గిరిజన గ్రామాలకు ఇదే ప్రధాన రహదారి. రెండున్నర దశాబ్దాల కిందట వేసిన ఈ రోడ్డు కనీసం మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిదులు దృష్టి సారించి రోడ్డు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు మండల సమావేశం

నరసన్నపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వెంకటేష్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులంతా పూర్తి స్థాయి సమాచారంతో హాజరు కావాలన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కోటబొమ్మాళి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి సబ్ స్టేషన్‌లో మరమతులు నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ నరసింహకుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో సబ్ స్టేషన్ పరిధిలోని కోటబొమ్మాళి, కొత్తపేట, కిష్టుపురం, నీలంపేట, తాటిపర్తి, మహసాహెబ్‌పేట, పట్టుపురం, చీపుర్లపాడు, అక్కయ్యవలస, జీయన్నపేట, తర్లిపేట, కన్నేవలస, జర్జంగి, కస్తూరిపాడు, దుప్పలపాడు, శ్రీజగన్నాథపురం, సరియాబొడ్డపాడు, ఎలమంచిలి, గంగారాం, లఖందిడ్డి పంచాయతీల్లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

పశువులు పట్టివేత

కొత్తూరు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కర్లెమ్మ, కౌశల్యపురం నుంచి అక్రమం గా తరలిస్తున్న పశువుల వ్యాన్లను పట్టుకున్నట్టు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు. పట్టుబడిన పశువులను విజయనగరం జిల్లాలో ఉన్న గోశాలకు తరలించామని, పశువుల అక్రమ రవాణాదారులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

కబ్జా ప్రయత్నాలు అడ్డుకోవాలి

బూర్జ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): డీపట్టా భూముల కబ్జా ప్రయత్నాలను అడ్డుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉప్పునివలస గ్రామ పరిధిలోని ఉన్న 105 ఎకరాల కొండపోడు భూమిని బడానేతల అండతో క్వారీ నిర్వహించి కాజేసేందుకు శ్రీకాకుళానికి చెందిన ఓ వ్యక్తి ప్రయత్నిస్తున్నాడన్నారు. దీనిని అడ్డుకోవాలని కోరుతూ దళితులు సచివాలయంలో గురువారం ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం స్పందించి దళితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

పాతపెన్షన్ పునరుద్ధరించాలి


వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రాప్తికి అర్హతగల ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డీఎస్సీ-2003 ఫోరమ్ జిల్లా కో కన్వీనర్ అంబటి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాడాన రాజు, టి.జనార్ధనరావు, రమణ, చిరంజీవి, వాసు, ఉమాశంకర్, సురేష్‌కుమార్, రజనీ, రమేష్, లక్ష్మి, శాంతి, కమలకుమారి, రోజామణి, రామారావు, తాతన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రణభేరి పోస్టర్ ఆవిష్కరణ

కోటబొమ్మాళి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్థిక విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు గురువారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం దగ్గర యుటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు రణబేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలపై ఈ నెల17 నుంచి 19 వరకు నిర్వహించనున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు వాసుదేవరావు, నారాయణరావు, సింహాచలం, ఆనందరావు, మన్మథరావు పాల్గొన్నారు.

ధర్నా జయప్రదం చేయాలి

సంతబొమ్మాళి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 7న అమరావతిలో నిర్వహించనున్న ఫ్యాప్టో ధర్నా జయప్రదం చేయాలని ఏపీటీఎఫ్(1938) జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కూరు ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం ఉపాధ్యాయ సంఘ బృందం బోరుభద్ర, కొల్లిపాడు, గెద్దలపాడు, పాతమేఘవరం జడ్పీ పాఠశాలను సందర్శించారు. సంఘ నాయకులు చింతాడ దిలీప్ కుమార్, టెంక చలపతిరావు, జితేంద్ర, కొండాల వెంకటరమణ మూర్తి, మెండ రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

వజ్రపుకొత్తూరు, సెప్టంబరు 11(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు తులసీరావు, వెంకట్రావు డిమాండ్ చేశారు. గురువారం ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు నిరసన వారం ప్రకటించింది. తొలి రోజు నల్లబాడ్జీలతో ఉపాధ్యాయులు విదులకు హాజరయ్యారు. జగన్నాయకులు, వెంకుమహంతి, నవీన్‌కుమార్,కరణాకర్ తదితరులు పాల్గొన్నారు.

● నందిగాం: ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరసన వారంలో భాగంగా గురువారం నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు విధులకు హాజరయ్యారు. ఈనెల 17 వరకు ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

● జలుమూరు: ఈనెల 11 నుండి 17 వరకు నిరసన వారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి అన్నారు. తిమడాం, రామకృష్ణాపురం తదితర ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు నల్లబాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.

● పలాసరూరల్: తెలంగాణ మాదిరిగానే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉపాధ్యాయులకు న్యాయం చేయా లని పలాస తహసీల్దార్ కార్యాలయం ఎదుట డీఎస్సీ -2003 ఉపాధ్యాయుల నిరసన తెలిపారు. తహసీల్దార్ ఎన్.కల్యాణ్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు.

● మందస: మండలంలోని ఉన్నత, ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. పెండింగ్ డీఏల విడుదల, పీఆర్‌సీ కమిటీ నియామకం, ఐఆర్ ప్రకటన, ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించానలి ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.

కాంబోడియా సెమినార్‌కు పలాస వ్యాపారి

● జీడి పప్పు ఉత్పత్తులపై ప్రసంగం


రాష్ట్ర ప్రతినిధులతో మల్లా కాంతారావు

పలాస, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంబోడియా దేశంలో ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ మూడు రోజుల పాటు వ్యవసాయం-అటవీ-మత్స్యశాఖ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. దీనికి రాష్ట్ర జీడి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు ఫణిరాఘవులు, ఉపాధ్యక్షుడు, పలాసకు చెందిన జీడి వ్యాపారి మల్లా కాంతారావు రాష్ట్ర ప్రతినిధులుగా హాజరయ్యారు. అఖిల భారత జీడి పప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు బోలా రాహుల్ కమత్, కార్యదర్శి ఎం.రామకృష్ణన్ ఆధ్వర్యంలో ఆహార పదార్థాల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఏపీఈడీఏ) అధికారులతో పాటు వీరు కూడా హాజరయ్యారు. సభలో మల్లా కాంతారావు జీడి పప్పు ఎగుమతులు, దిగుమతులు, వాటి లాభాలపై ప్రసంగించారు. జీడిపప్పు రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను వివరించారు. ఎం 23 రకం జీడి పప్పునకు భారత మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని వివరించారు.